5వ తేదీ వరకు సదరం సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్‌కు అవకాశం

అంబర్‌పేట: దివ్యాంగుల కోసం సదరం సర్టిఫికెట్ జారీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల 5వ తేదీ వరకు దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో కోరింది. మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే తేదీ, సమయం కేటాయిస్తారని పేర్కొంది. అంధులకు సరోజిని దేవి కంటి ఆసుపత్రి, ఇతరులకు మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపులు ఉంటాయని తెలిపింది. మీసేవా కేంద్రాలో స్లాట్ బుక్ చేసుకుంటేనే సదరం క్యాంపులో అవకాశం ఉంటుందని పేర్కొంది. మరింత సమాచారం కోసం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని సూచించింది.

ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతో దోహదం



చిక్కడపల్లి: గాంధీనగర్ కెనరా బ్యాంక్ సమీపంలోని జీహెచ్‌ఎంసీ గ్రాండ్స్‌లో ఆదివారం కోచ్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, బ్లాక్ బెల్ట్ సర్టిఫికెషన్ ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి మీరె మహాజ్ ఆలీఖాన్ హాజరై బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మ రక్షణలకు తైక్వాండో ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిమినర్ సంజయ్‌సింగ్, కోచ్‌లు మనీష్, రఘు, ఎస్.స్వామి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సురేష్ కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సురేష్ ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం అతడి నివాసానికి పరామర్శించారు. ఆందోళన చెందవద్దని సురేష్ కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, బస్తీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ధర్నాకు తరలిన అంబర్‌పేట నేతలు

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ధర్నాకు అంబర్‌పేట కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. తరలివెళ్లిన వారిలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు రామ్మోహన్, శ్రీమంత్‌గిరి, సాకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకుప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి



కాచిగూడ: బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలిఅడ్డలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 54శాతం జనాభా ఉన్న బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. బీసీల పట్ల కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బీసీలకు కేవలం రూ.2500 కోట్లు కేటాయించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, కిశోర్ గౌడ్, సత్యపాల్ సింగ్, భాస్కర్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన ఓ గుర్తుతెలియని వ్యక్తి (40) కాచిగూడ రైల్వే స్టేషన్ ఫుట్‌పాత్ ఏరియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసంత పంచమికి సర్వం సిద్ధం

జోన్ వ్యాప్తంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



న్యూ రామాలయంలోని సరస్వతి మాత



శంకరమఠంలోని శారదామాత

నల్లకుంట: మాఘ మాసం ప్రారంభమైన ఐదో రోజున హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ వసంత పంచమి. ఈ పర్వదినం సోమవారం రానుండటంతో అంబర్‌పేట నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేయింకుంటారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సరస్వతి పూజకి అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలు, ఇళ్లలోనే కాకుండా సంగీత విద్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ సరస్వతి పూజలు నిర్వహిస్తారు.

న్యూ రామాలయంలో..

న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ స్వామి సరస్వతి ఆలయ (న్యూరామాలయం) ప్రాంగణంలోని సరస్వతి మందిరంలో ప్రత్యేక పూజల కోసం భక్తుల సహకారంతో దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేయించింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం సరస్వతి మాతకు 108 లీటర్ల ఆవు పాలతో ప్రత్యేక అభిషేకం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. జయంతి తెలిపారు. అనంతరం సరస్వతి మాత శాఖంబరి అలంకరణలో భక్తులకు కనువిందు చేస్తారన్నారు. అలాగే అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్న ప్రాసనలు చేయించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయించమని తెలిపారు.

శంకరమఠంలో..

శంకరమఠంలో మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాఘ మాసం శుద్ధ చవితిని పురస్కరించుకొని ఉదయం శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి ప్రాంగణంలో గల యాగశాలలో గణపతి హోమము నిర్వహించారు.

నేడు ప్రత్యేక పూజలు..

వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం ఉదయం శక్తి గణపతికి తొలిపూజలు ఉంటాయి. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు, అలాగే శ్రీ శారదా మాతకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మఠం పాంగణంలో లలితా హోమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను మఠం పాలకమండలి ఏర్పాటు చేసింది.

సరస్వతి సంగీత విద్యాలయంలో సంగీత సేవకు ఏర్పాట్లు..

నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సరస్వతి సంగీత విద్యాలయంలో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయని విద్యాలయం సంగీతం అధ్యాపకురాలు యశస్విని తెలిపారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మచే సరస్వతి మాతకు సంగీత సేవ (స్వర నీరాజం) ఉంటుందన్నారు.

'నడవండి.. నడిపించండి'

వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి



సుందరయ్య పార్కులో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతిని సన్మానిస్తున్న పీవీ నిరంజన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలని అప్పుడే మనిషి అనుకున్నది సాధించగలుగుతాడని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు ప్రభావతిని సన్మానించారు. అనంతరం ప్రభావతి మాట్లాడుతూ... 'నడవండి.. నడిపించండి'అనే లక్ష్యంతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా క్లబ్‌ను కొనసాగించాలని సూచించారు. సుందరయ్య పార్కులో వాకర్ల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషన్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, 301 డిస్ట్రిక్ గవర్నర్ లింగప్రకాష్ గుప్తా, గవర్నర్ చీఫ్ కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, రీజినల్ గవర్నర్ మురళీకృష్ణ, క్లబ్ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, కళ్యాణినాయక్, డా. సునీల్, రమేష్‌రెడ్డి, శైలజామోహన్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్, సునీతారెడ్డి, ఆర్.వివేక్ తదితరులు పాల్గొన్నారు.

జాతి గౌరవాన్ని నిలిపిన మహనీయులను మరవొద్దు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలోత్సవంలో పాల్గొన్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జాతి గౌరవాన్ని నిలిపిన మహనీయులను మరవొద్దని తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. వీరమాతలు చూపిన మార్గాలను బాలికలు అనుసరించాలని ఆయన సూచించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీర వనితల స్ఫూర్తి పాత్రలు పోషించిన బాలికలను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నేడు ఆడపిల్లలు అన్నిరంగాలలో రాణిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షుడు కె.సుజావతి, మమత, రూప, రుక్మిణి, నవీన్, బ్రాహ్మణీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అవగాహన రాహిత్యంతోనే ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు



లేఖను పోస్టు చేస్తున్న కాంగ్రెస్ నేతలు తేజ గౌడ్, జీఎస్.చారి

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అర గ్యారంటీ కూడా అమలు కాలేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడటం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నేత తేజగౌడ్ అన్నారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటికి కేటాయించిన నిధులను వివరాలను తెలియజేస్తూ ఒక లేఖను ఆయన డాక్టర్ లక్ష్మణ్‌కు శనివారం పోస్ట్ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణాన్ని 136కోట్ల మంది లబ్ధి పొందారని అన్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4500 కోట్లను ఖర్చు చేసిందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 50లక్షల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయని అన్నారు. 43లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోందని తెలిపారు. రైతుబంధు, రుణ మాఫీ, రైతు భరోసా కింద రూ.58,280కోట్లను రైతు సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జీఎస్.చారి, రామకృష్ణ, రాజు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ భక్తిగీతం విడుదల



పాట సీడీని విడుదల చేస్తున్న కళాజనార్దనామూర్తి, అన్నపూర్ణ, లిఖిత్

చిక్కడపల్లి: హాస్య బ్రహ్మగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పాత్రికేయుడు శంకరనారాయణ కనకదుర్గమ్మపై భక్తిగీతం రాశారని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు జనార్ధనామూర్తి అన్నారు. త్యాగరాయ గానసభలో శనివారం ఆయన పాటను విడుదల చేసి మాట్లాడారు. శంకనారాయణ దేవుళ్లపై 35 శతకాలు రాశారని తెలిపారు. ఈ పాటను పాటల రచయిత, స్వరకర్త రాయవరపు విశ్వేశ్వరరావు స్వరకల్పన చేసి అద్భుతంగా గానం చేశారని అభినందించారు. ఈ పాటకు దోర్బల లిఖిత్ సంగీతం సమకూర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పెరి అన్నపూర్ణ, జి.గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పంజగుట్ట: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ–డి నుండి బిసీ–ఎ లోకి మార్చాలని వివిధ ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు ఉప్పరి నారాయణ ముదిరాజ్, బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, డాక్టర్ వై.శివ ముదిరాజ్‌లు మాట్లాడుతూ .. ముదిరాజ్‌లను బిసి–డి నుండి బిసి–ఎ లోకి మార్చకపోవడంవల్ల విద్యా, ఉద్యోగాల్లో ముదిరాజ్ యువత ఎంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కోట్ల పుష్పలత, లావణ్య, రేణుక, కృష్ణ, తాయప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

లిబర్టీ: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దేశాన్ని కాపాడే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు వెల్లడించారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ పేరిట కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశాన్ని రక్షించేందుకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళుతుందని ఆయన అన్నారు.

ప్రతి విద్యార్థి ఇంగ్లిష్ నేర్చుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌ను నేర్చుకోవాలని ఐఆర్‌ఎస్ ఛైర్మన్, సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. ఆదివారం ఓయూ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో రాష్ట్ర గవర్నర్ నిధులతో ట్రైబల్ విద్యార్థులకు నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బలరాం మాట్లాడుతూ ఇంగ్లిష్‌ను అందరు నేర్చుకోవాలని అందుకు సింగరేణి సంస్థ తరఫున ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొ.విజయ్, ప్రొ.సొడ సవీన్, క్రిస్టోఫర్, మాధవి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుసుమ హరుల నామస్మరణ వారోత్సవాలు





హారతి ఇస్తున్న అర్చక స్వామి, సుప్రభాత సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న కుసుమ హరుల నామస్మరణ వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజామునే మౌన నామ జపం, సుప్రభాత సంకీర్తనతో ప్రభాత్ హారతి నిర్వహించారు. అర్చకస్వామి రామ్‌గోపాల్ మంత్రోచ్ఛరణల నడుమ కుసుమ హరులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అఖండ నామం, మంగళ హారతి అనంతరం పవళింపు సేవతో మొదటి రోజు కార్యక్రమాలు ముగిసాయి. ఆశ్రమ ప్రాంగణం కుసుమ హరుల నామస్మరణలతో మార్మోగింది. 8వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతాయని ఆశ్రమ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

నందరాజ్‌గౌడ్ స్మారక స్థూపానికి నివాళి

అంబర్‌పేట: అయోధ్యలో జరిగిన కరసేవలో దివంగత బీజేపీ నేత నందరాజ్‌గౌడ్ ముందున్న వీర సైనికుడని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆయన ఆశయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించి నెరవేర్చారన్నారు. ఐఎస్ఐ ఉగ్రవాదుల చేతిలో వీరమరణం పొందిన దివంగత బీజేపీ నేత షహీద్ నందరాజ్‌గౌడ్ 32వ వర్ధంతి బాగ్‌అంబర్‌పేటలోని అయ్యప్ప ఆలయ రోడ్‌లో ఉన్న ఆయన స్మారక స్థూపం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు మాజీ మంత్రి కృష్ణయాదవ్ హాజరై స్మారకస్థూపానికి నివాళులర్పించారు. బీజేవైఎం అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షుడు సునిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృత, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, శ్యామ్ రాజ్, నందరాజ్‌గౌడ్ సతిమణి లలితా నందరాజ్‌గౌడ్, కుమారుడు రోహిత్‌నందరాజ్‌గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో సరికొత్త శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలోని నగీనాబాగ్, ఆయుధాగారం, రాణీమహల్, కోటలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరచబడిన ఫిరంగులను ఎంతో ఆసక్తిగా తిలకించారు. మరో వైపు విదేశీ పర్యాటకులు సైతం గోల్కొండ కోటలో కలియతిరుగుతూ ఫొటోలు తీస్తూ కనిపించారు. ఇదిలా ఉండగా నగీనాబాగ్ గార్డెన్స్ చిన్నారుల ఆటపాటలకు వేదిక కాగా యువ జంటలకు క్లాపింగ్ పోర్టికోలోని ఫిరంగులు, రామదాసు చరసాల తదితర ప్రాంతాలు సెల్ఫీలు తీసుకుంటూ సందడిగా గడిపారు.

అన్నివర్గాలకు న్యాయం జరిగేలా కేంద్ర బడ్జెట్



ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలసీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జి.రచనశ్రీ

కవాడిగూడ: దేశంలోని అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం బడ్జెట్‌ను రూపొందించిందని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. ఆదివారం ఇందిరాపార్కు చౌరస్తాలో కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ జి. రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ రవీందర్ మాట్లాడారు. అన్ని రాష్ట్రాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోని కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. రూ.12లక్షల వరకు ట్యాక్స్ లేకుండా నిర్ణయం తీసుకోవడం సాహసోపేతం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, ప్రభాకర్ గంగపుత్ర, మీసాల విఠల్, శ్రీనివాస్, బీఎం. శ్రీనివాస్, భోనగిరి శేఖర్, వాసు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్



కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి సగం ఎంపీ సీట్లు బీజేపీకి ఇచ్చినప్పటికీ నరేంద్రమోదీ ప్రభుత్వం మాత్రం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విమర్శించారు. ఆదివారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారి పెద్దపెద్ద హామీలు ఇచ్చే కేంద్రమంత్రుల మాటలు నీటి మూటలైనవని ఇది కేంద్ర బడ్జెట్ ద్వారా మరోసారి రుజువైందని మండిపడ్డారు. పేద వర్గాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, పేదల సంక్షేమానికి నిర్దిష్టమైన ఎలాంటి కార్యక్రమాలు తీసుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి ఇక్కడి బీజేపీ ఎంపీలు ప్రశ్నించకపోవడం వల్లనే నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల తీవ్ర వివక్షతను ప్రదర్శించారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి రూ.40వేల కోట్ల జీఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ నిధులు దేనికి కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించి పసుపు బోర్డుతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పథకాలకు నిధులు కేటాయించకపోవడం దౌర్భాగ్యమని అన్నారు. బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన ఏఐఎఫ్‌టీయూ సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో నెలకొన్న ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని అందుకు కార్మిక సంఘాలన్నీ ముందు భాగాన నిలబడాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ) ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.... దేశంలో శ్రమకు తగ్గ ఫలితం కార్మికులకు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమశక్తి నిదోపిడీకి గురిచేస్తున్న వ్యవస్థలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. అణచివేత అసమానతలు, పీడనం లేని నూతన వ్యవస్థకోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

◆ ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షులు గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడుతూ.... శ్రమదోపిడీ పెంపుదల కోసం పాలకులు తెచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటల పెంపునకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటం చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు సాగిస్తున్న దోపిడీని అరికట్టాలని అన్నారు. పెట్టుబడిదారి వర్గాల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు.

◆ భూమికోసం, వ్యవసాయ రంగ రక్షణకోసం సాగిస్తున్న పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. భారత సమాజంలో పడగ విప్పిన పాలకుల మతోన్మాద ఫాసిజంపై కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతుకూలి సంఘం నాయకులు ప్రసాద్ అన్న, రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ఏఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు గణేష్ పండా, జె. కిషోర్‌బాబు, తెలంగాణ రైతుకూలిసంఘం రాష్ట్ర కార్యదర్శి కేమిడి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.